# తిరువాయ్ మొళ్ళి సంగ్రహము

తిరువాయ్ మొళ్ళి ని ద్రావిడ వేదమని అంటారని వెనుక మనవి చేసుకొని యున్నాము.(వాయ్ మొళ్ళి అంటే వేదము అని కూడా అర్థమున్నదట). వేదములు అందరికీ అందుబాటులో ఉండవు కనుక, అందరినీ ఉద్ధరించడం కోసం స్వామి నమ్మాళ్వార్లు ద్వారా ప్రబంధము ప్రసాదించఁబడినది అని పెద్దలు చెబుతారు. లక్ష్మీ సహితుడైన పరమాత్మయే స్వయముగా ఆళ్వార్ల చేత ఈ ప్రబంధాన్ని ప్రకాశింపఁజేసి, ఆళ్వార్లు పాడుతుండగా తాము విని ఆనందించేరట. అనగా వేదమును వలె ఈ గ్రంథమును ప్రకాశింపఁజేసినది కూడా భగవానుడే. దర్శించి, అనుభవించి, అందించినది నమ్మాళ్వార్లు.

వేదము వలెనే ఈ గ్రంథము కూడా మన అనిష్టనివృత్తికి, ఇష్టప్రాప్తికి వలయు మార్గమును బోధిస్తుంది. ఎవరికైనా ఇష్టప్రాప్తి అంటే ఆనందమే కదా. అయితే లౌకికమైన విషయముల వలన తాత్కాలిమైనదీ, పరిమితమైనదీ, దుఃఖములతో ముడిపడి యుండేదీ అయిన ఆనందమే లభ్యమవుతుంది. అట్లు కాక పరమాత్మానుభవజనితానందము అపరిమితమై, నిత్యమై, దుఃఖప్రత్యనీకమై ఉంటుంది. ఈ ప్రబంధము పూర్తిగా భగవద్విషయమే, కనుక పరమాత్మానందప్రదము.

ఈ ప్రబంధము మూడు మార్గాలలో సాగుతుంది, మనలను నడిపిస్తుంది.

1.శాస్త్ర,సంప్రదాయములకు సంబంధించిన జ్ఞానాన్ని అందించడం

2.మనము చేయవలసినవియు, విడువ వలసినవియును అయిన పనులను, ఆలోచనలను తెలియఁజేయడం. ఉజ్జీవన దిశా మార్గాన్ని నిర్దేశించడం.

3. ఆద్యంతమూ పరమాత్మతో ఆళ్వార్ల మానసిక, శారీరక అనుభవాలను, పరిణామాలను వివరించడం

సంప్రదాయవాఙ్మయములో దీనికి సాటి అయిన ప్రబంధము లేదని పెద్దలు చెప్పుదురు. దీనికి ఉదాహరణముగా ఒక ఐతిహ్యాన్ని చెబుతారు. కంబ మహాకవి నమ్మాళ్వార్ల గొప్పదనాన్ని విని, తన కంటే గొప్ప కవి ఉండడానికి అవకాశము లేదని చెప్పి తనతో పోటీలో పాల్గొనడానికి ఆళ్వార్లను తోడుకొని రమ్మని ఆయన శిష్యులను పంపేరట. ఆళ్వార్ల వద్ద వేంచేసియున్న మధురకవులు, "ఆళ్వార్లు ఎచ్చటకూ కదలరు. ఆయన వ్రాసిన ఒక దివ్యసూక్తి మాత్రము ఈయ గలను, దానితో మీరు పరీక్షించుకొనుడు" అనగా, ఆ దివ్యసూక్తి

నుంచుసరికి, అచ్చటి విద్వత్పీఠము అచ్చటనున్న 300 మంది విద్వద్వరేణ్యులను క్రింద పడవైచి ఆళ్వార్ల దివ్యసూక్తి ధరించినదట. కంబమహాకవి, అంతట ఆళ్వార్ల గొప్పదనాన్ని గ్రహించిన వాడై ఆయనను కీర్తిస్తూ కవిత్వము చెప్పేడట. అది ఆళ్వార్ల కవితావైభవము. ఇంక మిగిలిన విషయాల గురించి చెప్పునదేమి. పరమాత్మానుగ్రహము వలన జాలువారిన అమృతధారయే కదా.

ఈ ప్రబంధములో ఆళ్వార్లు 32 దివ్యదేశాలను, అచ్చటి అర్చ్యామూర్తులను అనుసంధించేరు. అందు పాండ్యదేశమున 12, కేరళమున 13, చోళదేశమున 5, తొండీరమండలమున 1, ఉత్తరదేశమున 1 ఉన్నవి. ఆయా అర్చ్యామూర్తులే స్వయముగా వచ్చి ఆళ్వార్లకు సేవ కృపఃజేసారని పెద్దలు చెబుతారు.

వీరు ఈ తిరువాయ్ మొళ్ళి ప్రబంధమును కృపఃజేయు సమయమున, కృష్ణానుభవపరవశులై, మూడు సార్లు ఆరారు మాసముల చొప్పున స్మృతి కోలుపోయినారుట. వీరి అనుభవము అంత గొప్పది.

## సంక్షిప్తముగా ఈ ప్రబంధములోని కొన్ని ముఖ్య విషయాలు తెలుసుకొనే ప్రయత్నము చేద్దాము.

శ్రీవైష్ణవ సంప్రదాయిక రహస్యములైన, తత్త్వ త్రయజ్ఞానము (అనగా తత్త్వములు మూడు. అవి జీవాత్మలు, ప్రకృతి, పరమాత్మ.), వాని సంబంధము, అనగా అందు పరమాత్మ తో ప్రకృతి, జీవుళ్ళకు గల శేషి, శేష లేదా శరీరి, శరీర, లేదా ఆధార ఆధేయ, లేదా ప్రకారి, ప్రకార సంబంధములు ఈ ప్రబంధములో వివరించబడినాయి.

పరమాత్మ కళ్యాణ గుణాకరుడని, హేయప్రత్యనీకుడనీ, జగత్సృష్ట్యాదులన్నీ నిర్వహించువాడనీ....ఈ విధముగా ఎన్నో సంప్రదాయ రహస్యాలు అందించబడినాయి. తద్వారా తక్కిన వాదములు సంస్కరించబడినాయి.

ఈ ప్రబంధము అర్థపంచకజ్ఞానమును వివరిస్తుంది. అంటే ప్రాప్యమైన పరమాత్మ విషయమూ, ప్రాప్తుడైన జీవాత్మ విషయమూ, ఆ ప్రాప్యాన్ని పొందుటకు ఉపాయాన్ని, ఫలాన్ని, పొందుటకు విరోధులను అర్థపంచకమని అంటారు. ఈ జ్ఞానాన్ని సంపూర్ణముగా వివరించేది ఈ ప్రబంధము.

శ్రీవైష్ణవ సంప్రదాయములో అష్టాక్షరి, ద్వయము, చరమ శ్లోకములను మూడిటిని ముముక్షువులు తప్పక తెలుసుకొనవలెనని చెప్పుదురు. ఆ మూడు మంత్రముల వివరణ ఈ ప్రబంధమున చెప్పబడినది. తిరువాయ్ మొళ్ళి ప్రబంధము మొత్తము ద్వయమంత్రాన్ని చెబుతుందని పెద్దలు చెప్పుదురు. ఇందులో మొదటి

మూడు వందల పాశురములు ద్వయ మంత్రమునందలి ఉత్తర ఖండాన్ని చెబితే, తక్కిన భాగము పూర్వ ఖండాన్ని వివరిస్తుందట.

మన సంప్రదాయములో అతి ముఖ్యములైన భక్తి, ప్రపత్తి మార్గాలను వివరముగా తెలుపుతుంది ఈ ప్రబంధము.

పరమాత్మ కళ్యాణగుణములను, అవతార రహస్యములను, అర్చ్యారూపములను, పర, వ్యూహ రూపాలను కూడా చాలా విస్తృతముగా వివరించినది ఈ గ్రంథము. అంతర్యామి తత్త్వాన్ని కూడా వివరముగా వర్ణించిన గ్రంథమిది.

పరబ్రహ్మ విషయాన్ని సూత్రరూపముగా వేదవ్యాసులవారు బ్రహ్మ సూత్రములను పేరుతో అందించేరు. ఆ సూత్రములకే భగవద్రామానుజుల వారు శ్రీభాష్యమనబడు భాష్యగ్రంథాన్ని అందించేరు. వాటిలో మొదటి నాలుగు సూత్రములను "చతుస్సూత్రి" అని అంటారు. ఈ నాలుగు సూత్రముల వివరణ మొదటి రెండు దశకాలలో ఆళ్వార్లు అందించేరు. మిగిలిన భాగము వీటి వివరణమైన మిగిలిన బ్రహ్మ సూత్రాలే.

ఈ ప్రబంధములో ఆళ్వార్లు సుమారు 73 దశకాలను పురుషభావమున్న వారిగా చెప్పినా, 27 దశకాలు ఇతర అవస్థలలో ఉండి చెప్పేరు. అందు నాయకి అవస్థలో 17, తల్లి అవస్థలో 7, చెలికత్తె అవస్థ లో 3 చెప్పేరు. ఇంకెప్పుడు తాను వైకుంఠము చేరగలనని, సుమారు 17 పర్యాయములు దుఃఖాన్ని అనుభవించేరు. ఒక దశకములో గోపికల పొందిన దుఖాన్ని, మరొక దశకములో పిరాట్టి పొందిన దుఃఖాన్ని కూడా అనుభవించేరు.

నవరసములను వేరు వేరు తిరువాయ్ మొళులలో అనుభవించి చూపేరు. విప్రలబ్ధ, విరహోత్కంఠిత మొదలగు కావ్య నాయికావస్థలను అనుభవించి చూపేరు. మొరటు దనాన్ని, మొండి తనాన్ని చూపించి మడలెత్తడం వంటి ప్రయత్నాలు చేస్తానని స్వామిని బెదిరించేరు.

నాలుగు పర్యాయములు దూతప్రేషణమును చేసి, తమకు గల ఆచార్యాభిమానము ప్రదర్శించేరు.

స్వామితో సంశ్లేషము, విశ్లేషము, పునఃవిశ్లేషభీరుత్వము, అస్థానే భయశంక మొదలైన వేరు వేరు స్థితులను అనుభవించి, ప్రదర్శించేరు.

మొదటి శతకములో పరమాత్మయే ఉపాయము  అని నిష్కర్షించేరు. సకలఫలప్రదత్వ, సర్వకారణత్వ, శ్రియఃపతిత్వాదులతో సర్వేశ్వరునికి సర్వదేవతలకంటే ఆధిక్యత చెప్పబడుతుంది.

ఱెండవ శతకములో పరమాత్మయే పరమప్రాప్యము అని నిర్ధారించేరు. నామ సంకీర్తన మొదలైన సాంగ భక్తి కూడా తెలుపబడినది.

మూడవ శతకములో స్వామి శుభాశ్రయుడనీ, ఆతని వద్ద అవిచ్ఛిన్నమైన కైంకర్య ప్రాప్తి తనకు కావలసిన ఫలమనీ తెలియఁజేసేరు.

నాల్గవ శతకములో పరమాత్మ పరత్వాన్ని, జగత్కారణత్వ, రక్షకత్వాదులను చెప్పి, పరమాత్మ యే ఎందుకు ప్రాప్యమో చెబుతూ, ఆయన ఐశ్వర్యము నిత్యము, స్థిరము అనీ, ఆయన సహజభోగ్యుడనీ, సర్వశేషి అనీ, ప్రాణులు ఆయనను విడచి ఉన్నప్పుడు క్లేశమును, ఆయనతో ఉన్నప్పుడు ఆనందమును కలిగి యుంటారని, ఆయన సర్వస్వామి అనీ, అఖిల ప్రాణులకూ నిర్హేతుకమైన సుహృత్ అనీ, సంసార దుఃఖములను పోగొట్టుననీ, బ్రహ్మానందప్రదాత యనీ చెబుతారు.

ఐదవ శతకములో పరమాత్మ వైభవాన్ని కళ్యాణ గుణాలను అనుసంధానము చేస్తారు. ప్రాప్య వైలక్షణ్యాన్ని కూడా చెప్పేరు.

ఈ ఉపాయభూతత్వాన్ని ఐదవ శతకమునుండి, పదవవశతకము వరకూ క్రమముగా వివరిస్తారు.

ఆఱవ శతకములో సాంగోపాంగముగా లక్ష్మీ సహితుడైన  తిరువేంగడముడైయాన్ వద్ద శరణాగతి చేస్తారు.

ఏడవ శతకములో శరణాగతి చేసిన తరువాత కూడా ఫలము దక్కలేదే అని బాధపడతారు. తరువాత స్వామియే రక్షకుడను మహావిశ్వాసముతో ప్రార్థిస్తారు.

ప్రాప్య చరమావధి భాగవత శేషత్వమని కూడా చెప్పేరు.

ఎనిమిదవ శతకము స్వామి భక్త చిత్తానుసారి గా ఎలా వ్యవహరిస్తాడో చెబుతుంది. ఆళ్వార్లు తాను ఏవిధముగా తనకు పరమాత్మ వద్ద నిత్య, నిరవద్యమైన కైంకర్యము కోరుకుంటున్నారో విన్నవిస్తారు.

తొమ్మిద శతకములో పరమాత్మకు తన భక్తులయందు గల అపారమైన ప్రేమ గురించి చెప్పి, వారు ఉజ్జీవించుటకు ఉపాయము బోధించుతారు.

పదవ దశకములో లోకుల ఉజ్జీవనమునకు చివరిసారిగా ఉపదేశము చేసి స్వామితో పరమపదమునకు వేంచేస్తారు.  దానికి ముందుగా ఆ మార్గాన్ని దర్శించి, మనచేత దర్శింపఁజేస్తారు.

ఈ విధముగా తాను స్వామిని చేరవలెనను కోరిక ఏవిధముగా తీరినదో ఈ ప్రబంధములో ఆళ్వార్లు మనచేత దర్శింపఁజేస్తారు.

## ఇంక ఈ ప్రబంధము నందలి ఒక్కొక్క దశకమున ఏమి చెప్పబడినదో సంగ్రహముగా చూద్దాము.

1-1 మరియు 1-2 : ఆళ్వార్లు, తమను సాధారణ జీవునివలె భావించుకొని, పరమాత్మ నిర్హేతుక కటాక్షము చేత తమకి పరస్వరూపాన్ని, స్వస్వరూపాన్ని దర్శింపఁజేయుట వలన, అజ్ఞానగంధరహితమూ, అన్యథాజ్ఞానరహితమూ, విపరీతజ్ఞానరహితమూ అయిన జ్ఞానము కలవారైనారు. పరమాత్మను కళ్యాణగుణాకరునిగా వివరించి, ఆయనకు తనకూ గల శేషి, శేష సంబంధాన్ని ప్రకటించుకున్నారు. ఇందులో మొదటి 6 పాశురాలు బ్రహ్మసూత్రాలలో జిజ్ఞాసాధికరమును చెబితే, తరువాత 5 పాశురాలు జన్మాద్యధికరణాన్ని చెబుతాయి. ఱెండవ దశకములో మొదటి 8 పాశురాలు శాస్త్రయోనిత్వాధికరణమును చెబితే తరువాతి 3 పాశురములు సమన్వయాధికరణమును చెబుతాయి. ఈ విధముగా మొదటి ఱెండు దశకములు బ్రహ్మసూత్రములలో చతుస్సూత్రి అర్థములను ప్రతిపాదిస్తున్నాయి. మొదటి దశకము తత్త్వజ్ఞానాన్ని అందించి ఆ జ్ఞానము వలన ఆళ్వార్లు పొందిన మహదానందాన్ని గురించి చెబితే, ఱెండవది అట్టి స్థితి పొందడానికి లౌకికవిషయాలకు ఎలా దూరమవాలో ఉపదేశాత్మకముగా చెబుతుంది.

1-3 : మనము వెనుక ఈ ప్రబంధము, తత్త్వ జ్ఞానము, విధి, నిషేధముల గురించి ఉపదేశము, ఆళ్వార్ల అనుభవము అనే మూడు విషయాలను ఆద్యంతమూ చెబుతుంది అనుకున్నాము. మొదటి ఱెండు దశకాలలో జ్ఞానము, ఉపదేశము నిర్వహించిన ఆళ్వార్లు, మూడవదానిలో తన భగవదనుభవాన్ని సంకల్పిస్తారు. తనకుపకరించినవాడు పరమాత్మయే అని తెలిసి, ఆయన సౌలభ్యాది కళ్యాణగుణవైభవములకు ఆశ్చర్యపోయి, భగవదనుభవజనిత వ్యామోహ పరవశులవుతారు.

1-4 తమ దోషదర్శనము తమకు ఆటంకమవుతున్నదని పరమాత్మ కటాక్షము కొఱకు ప్రార్థిస్తారు.

1-5 : పరమాత్మ సౌలభ్యగుణాన్ని వ్యక్తము చేస్తారు.

1-6 : అన్య దేవతానిరసనము చెప్పి పరమాత్మ ఒక్కడే ప్రాపకుడు, ప్రాప్యుడు అని చెబుతారు.

1-7: కేవల ఆత్మానుభవము అనగా కైవల్యము కాని లౌకిక ఐశ్వర్యము కాని ప్రాప్యము కాదు అని చెబుతున్నారు.

1-8 /1-9 : పరమాత్మ యొక్క ఆర్జవత్వ, సర్వరస, సర్వగంధాది లక్షణాలను చెప్పి భోగ్యత్వాన్ని చెబుతున్నారు.

1-10: పరమాత్మ తో నిర్హేతుక సంశ్లేషాన్ని పొందుతూ విస్మయము పొందుతారు.

2-1 : నాయకీ దశలో విశ్లేషాన్ని అనుభవిస్తారు. దూతప్రేషణము చేస్తారు.

2-2 : పరమాత్మ జగత్కారణత్వాన్ని తెలియఁజెప్తూ పరోపదేశరూపములో కృపఁజేస్తున్నారు.

2-3 : మానసిక సంశ్లేషానుభవము చెప్పబడినది

2-4  : తల్లి ద్వారా తన అనుభవాన్ని వివరించుట(తాయ్ మార్ అవస్థ)

2-5 : తిరిగి పరమాత్మతో, దివ్యాయుధగణముతో బాటు,  సంశ్లేషానుభవము. దాని వలన కలుగు ఆనందాన్ని ప్రకటించుట

2-6 : పరమాత్మ జీవుని తనతో చేర్చుకునేందుకు ఎంత ప్రయత్నిస్తాడో చెబుతారు.

2-7/ 2-8: జీవుడు పరమాత్మ కటాక్షము వలన పొందిన అనుభవానందము పొంగి, పొర్లగా నామ సంకీర్తనము చెప్పి పరోపదేశము చేస్తారు.

2-9 : మోక్షస్వరూపవివరణము

2-10 : పరమాత్మస్వరూపసాక్షాత్కారానుభవము చెప్పబడినది. తిరుమాలిరుమ్ శోలై దివ్యదేశ ప్రస్తావనము.

3-1 : జీవుడికి ప్రకృతి సంబంధము చేత కలిగే జ్ఞానసంకోచము చెప్పబడినది. పరమాత్మ దివ్యమంగళవిగ్రహుడని నిరూపిస్తూ, నిర్గుణ, నిరాకార వాదము నిరసించబడినది.

3-2 : భగవత్కైంకర్య విరోధులను, తన్నిరసనమునూ చెప్పేరు.

3-3 : మోక్షఫలమైన స్వామికి కైంకర్యము సర్వదేశ సర్వకాలాలలోను సాగాలని తిరువేంగడముడైయాన్ ను ప్రార్థించేరు.

3-4 : పరమాత్మ యొక్క సర్వాత్మకత్వాన్ని అనుసంధించేరు.

3-5 : ఇతర ప్రయోజనములయందు దృష్టి లేక, పరమాత్మానుభవమునకై పరమాత్మను కీర్తించి ఆడి, పాడవలెనని ఉపదేశిస్తున్నారు.

3-6 : జ్ఞాన సంకోచము చేత బాధపడుతువ్నవారికి దిశానిర్దేశము చేసేరు.

3-7 : నిర్హేతుక జ్ఞానవైశద్యాన్ని పొందినందు వలన భాగవతులకు శేషముగా ఉండుటయే శ్రేష్ఠమని అనుసంధానము చేసేరు.

3-8 : పరమాత్మ యొక్క గుణానుసంధానము వలన కలిగిన సంశ్లేషాపేక్ష తీరక తమ బాధను చెబుతూ ఆర్తిని వ్యక్తపరిచేరు.

3-9 : ఉపాసనానిష్ఠుడు పొందే మానసిక వ్యథ వ్యక్తీకరించి, మిగిలిన వారివలె కాక తానయినా క్షుద్ర ప్రయోజనాల కొఱకు ఇతరుల వెనుక పడలేదు కదా అనుకున్నారు.

3-10 : ఆ అనుభవముతో అత్యంత ఆనందానుభవ ప్రకర్షను కీర్తిస్తున్నారు.

4-1 : విషయానుభవము అల్పాస్థిర ఫలాలనే ఇస్తుంది కనుక పరమాత్మనే ఉపాసించమని ఉపదేశము చేస్తున్నారు. తిరునారాయణపుర దివ్యదేశ ప్రస్తావనము.

4-2 : అత్యుత్కటమైన భగవదనుభవాలాభవేదన తల్లి ద్వారా అన్యాపదేశ రూపములో చెప్పబడినది.

4-3 : మానసికానుభవానందన్ని ప్రకటించేరు.

4-4 : విశ్లేషము చేత ఆర్తి మిక్కుటమై తాయ్ మారావస్థ లో అన్యాపదేశ రూపములో బాధపడుతున్నారు.

4-5 : పరమాత్మను మానసికంగా దర్శించిన ఆళ్వార్లు ఆ పరమాత్మకే మంగళాశాసనము చేసి, ఇంక తనకు కొఱత లేదు అని ఆనందిస్తారు.

4-6 : మానసికానుభవముతో సంతృప్తి చెందని ఆళ్వార్లు ప్రత్యక్షానుభవమునకై దుఃఖిస్తారు. అన్యోపదేశ రూపములో చెలికత్తెగా అర్తిప్రకటనాన్ని చేస్తూ అన్యోపాయ వర్జనాన్ని ఉపదేశిస్తారు.

4-7 : పరమాత్మ తనను కరుణించకపోవడానికి కారణము తన పాపమే అనుచూ ఆర్తి ప్రకటిస్తారు.

4-8 : నిస్పృహతో పరమాత్మ కరుణించని తన అస్తిత్వము ఎందుకు అంటూ బాధ పడతారు.

4-9 : పురుషార్థప్రాప్తికి స్వప్రయత్నము పనికి రాదు, పరమాత్మ అనుగ్రహమే అవసరమని తెలిసి ప్రార్థిస్తారు.

4-10 : తాను ఒక్కరూ మాత్రమే కాక లోకులు కూడా ఉద్ధరించబడాలని తలచి పరోపదేశము చేస్తారు.

5-1 : తమ శక్తిమంతమైన ధర్మభూతజ్ఞాన ప్రసరణము ఇతర శరీరాలలోని అంతఃకరణాలని కూడా పరిశుద్ధము చేస్తుందనే విషయము చెబుతున్నారు.

5-2 : భగవద్భాగవత వైభవ సమృద్ధికి మంగళాశాసనము చేస్తున్నారు.

5-3 : ప్రాప్యసిద్ధికి కలిగిన మిక్కుటమైన ఆర్తి, అన్యోపాయానుష్ఠానము ద్వారానైనా పరమాత్మను పొందవలెననన్నంతగా, పెరిగిపోవడాన్ని చూపిస్తారు.

5-4 : భగవదనుసంధానముతో కొంత ఊరట చెందుతారు.

5-5 : తాను దర్శిస్తున్న స్వామి గురించి ఇతరులకు తెలియలేదని చెప్పి తదేకోపాయనిష్ఠ తెలియఃజేసేరు. తిరుక్కురుంగుడి దివ్యదేశప్రస్తావనము.

5-6 : పరమాత్మానుభవస్థితి నుండి చెబుతూ ఈ సర్వమూ తానే అంటారు. ప్రీత్యప్రీతులు సమానముగా ఉండు దశ.

5-7 : అనన్యగతికత్వాన్ని ప్రకటిస్తారు. వానమామలై దివ్యదేశ ప్రస్తావనము.

5-8 : తన ఆర్తిని ప్రకటించుకొనడం, కుంభకోణములో అర్చ్యామూర్తి ప్రస్తావనము. కుంభకోణము లో శార్ఙ్గపాణిస్వామి దివ్యదేశ ప్రస్తావనము.

5-9 అన్యాపదేశముగా అలాభవ్యసన ప్రకటన కృపచేస్తారు. తిరువల్లవాళ్ దివ్యదేశ ప్రస్తావనము.

5-10 అవతార రహస్యజ్ఞానప్రకటన కృప చేయబడినది.

6-1 : ప్రాప్యసిద్ధికి దూతప్రేషణము. పురుషకారమును ప్రార్థించుట. తిరువణ్ వందూర్ దివ్యదేశ ప్రస్తావనము.

6-2 : పరమాత్మ జీవుడిని పొందుటకు చేసే ప్రయత్నాలు చెప్పబడినాయి.

6-3 : పరమాత్మ కళ్యాణగుణజనితప్రీతి ప్రకటనము. తిరువిణ్ణగర్ దివ్యదేశప్రస్తావనము.

6-4 : మానసికానుభవజనితానందప్రకటన

6-5 : పరమాత్మ కళ్యాణగుణానుసంధానము. తులైవిల్లిమంగల దివ్యదేశ ప్రస్తావనము.

6-6 / 6-7 : అలభ్య వ్యసనాధిక్యాన్ని అన్యాపదేశముగా తాయ్ మార్(తల్లి) గా చెప్పుట. ప్రాప్యత్వర.

6-8  : విశ్లేషదుఃఖము చేత దూషప్రేషణము. పురుషకారప్రార్థనము. తిరుక్కోవలూర్ ప్రస్తావనము.

6-9 :  పరమాత్మను దివ్యమంగళవిగ్రహముతో చూడవలెనని ప్రాప్యప్రార్థనము.

6-10 : సాంగోపాంగ ప్రపత్తి విజ్ఞాపనము.(లక్ష్మీసహితుడైన తిరువేంగడముడైయాన్ ను ఉద్దేశించి)

7-1 :అనన్యగతికత్వ విన్నపము. నామస్మరణమునకై ప్రార్థన. తనను ఇంద్రియముల బాధ నుండి రక్షించమని వేడుకుంటారు.

7-2 : తాయ్మార్ల ద్వారా తన ఆర్తినీ,  అనన్య గతికత్వాన్ని విన్నవించుకొనుట (శ్రీరంగనాథ అర్చ్యామూర్తి ని ఉద్దేశించి)

7-3 : తన మనస్సు తన వశములో లేదని, తిరుప్పేరై స్వామి వశమై పోయినదని చెప్పుట.

7-4  : పరమాత్మ విజయగాథల వర్ణనము, పరమాత్మ గుణాధిక్యత, స్వామి విభవావతార వైభవము అనుసంధానము

7-5  : పరమాత్మ కళ్యాణగుణాలను అనుసంధించి, "వాటిని ఎఱిగి యున్నవారు ఇతరులను ఆశ్రయించరు, ఆయనను ఆశ్రయించని వారు వ్యర్థజీవులు" అని చెబుతున్నారు.

7-6 : ఆర్తితో స్వామిని ఎప్పుడు చేరగలనో అంటున్నారు.

7-7 మానసిక సాక్షాత్కారానుభవానందము. కాని, బాహ్యసంశ్లేషాపేక్ష ఊహించుకొనుట వలన విశ్లేషవ్యసనదుఃఖానుభవము కూడ.

7-8  పరమాత్మ సర్వ వ్యాపనాన్ని అనుసంధించి, ఆయన మహిమకు ఆశ్చర్యపోతున్నారు.

7-9 : తన వలన లోకహితము జరగవలెనను పరమాత్మ ఉద్దేశ్యాన్ని గుర్తించేరు. ఇకముందు తమకి నిర్దేశించిన విహితకర్మానుష్ఠానము పూర్తి చేయుటయే తన కర్తవ్యము అని తెలుసుకొన్నారు.

7-10 విహితకర్మానుష్ఠానమైన భగవత్కైంకర్యము చేయుట. తిరువారన్ విళై దివ్యదేశ ప్రస్తావనము.

8-1 : పరమాత్మ ఆశ్రితపారతంత్ర్యముపై సంశయము. తనపై తనకు వ్యగ్రత. పరమాత్మ దివ్యమంగళవిగ్రహసాక్షాత్కారముతో సంశయనివృత్తి.

8-2 ఆర్తి ప్రబలమగుట. సర్వేశ్వరుడే ఉపాయమని నిశ్చయించుకొని కూడా, తనకు ఫలము కలుగకపోవుట వలన, విరహములో బాధ పడుతున్న నాయికా దశలో, తాను ప్రయత్నము చేయుట, చెలులు అది స్వరూప వరుద్ధము అని వారించినను వినలేని పరిస్థితి.

8-3  : పరమాత్మ తన సుకుమార దివ్యమంగళ విగ్రహసౌందర్యమును దర్శింపఁజేయగా, అస్థానభయశంక కలిగితే, పరమాత్మ తన చుట్టునున్న నిత్య, ముక్తాదులను దర్శింపఁజేయగా  భయనివర్తనము కలుగుట.

8-4 : మళ్ళీ అస్థాన భయశంక  దివ్యదేశాలలో అర్చ్యామూర్తుల విషయమై. స్వామి తన చుట్టుప్రక్కల నున్న

శ్రీవైష్ణవులను దర్శింపఁజేసిన తరువాత ఊరట. తిరుచెంగనూర్ దివ్యస్థలము ప్రస్తావనము.

8-5 బాహ్యసంశ్లేషాన్ని లభించక, బాధ పడుతున్న  మనసుతో పెరుమాళ్ళను ప్రార్థించుట, (రక్షాపేక్షతో ఎదురుచూస్తూ ఉండడమనే ఆయన గుణాన్ని తెలియఁజేస్తూ).

8-6 : శ్రీవైకుంఠము నుండి వచ్చి తిరుక్కడిత్తానమ్ దివ్య దేశములో వేంచేసి యున్న స్వామిని సంశ్లేషించుకున్న భావనతో పరమాత్మ యొక్క పరత్వాన్నీ అనుసంధించుట.

8-7  : తనను విశ్లేషించి స్వామి ఉండలేక తనహృదయములో ప్రవేశించేడని తమ ధన్యత్వాన్ని అనుసంధానము జేసుకున్నారు.

8-8 : తన హేయతను అనుసంధానము చేసికొని భగవత్సమాశ్రయణానికి వైముఖ్యము ప్రదర్శించగా, భగవానుడు నీవు నా శేషము అని తన స్వరూప, స్వభావములు తెలియఁజేసి వైముఖ్యాన్ని తొలగించడం. అంత పరమాత్మ నిర్హేతుక కృప అనుసంధానము చేసుకోవడం.

8-9 : తాము పిరాట్టి స్వభావాన్ని పొంది, అనన్యార్హశేషత్వాన్నీ, భగవచ్ఛేషత్వనిష్ఠనీ అన్యాపదేశముగా చూపించేరు.

8-10 : భాగవత శేషత్వము గొప్పదనము చెప్పి, తాను ఆ భాగవత శేషత్వమునే కోరుకుంటున్నట్లు చెప్పుట.

9-1 : సర్వేశ్వరుడే ప్రాప్యము, ప్రాపకము. ఆయనే నిరుపాధిక సుహృత్ కనుక లౌకిక బంధు, మిత్రులను కాక ఆయననే నమ్ముకొనమని లోకులకు ఉపదేశము చేస్తున్నారు.

9-2 : తిరుప్పుళింగుడి అర్చావతార ప్రస్తావనము. ఆయనకు ఏమగునో యను అస్థాన భయశంక.

9-3 : పరమాత్మ ఆళ్వార్లతో, భయపడవలసిన అవసరము లేదు. నేను అన్నీ చూసుకుంటాను అని చెబితే సమాధానపడి గుణ కీర్తనము చేయుట.

9-4 : పరమాత్మ నిరంకుశ స్వతంత్రుడు. కాని ఆయనలో సౌశీల్యాది గుణాలను ప్రకటింపఁజేసేది అమ్మ. అట్లు అమ్మతో వేంచేసిన స్వామిని అనుభవించి సంతృప్తులవుతున్నారు ఆళ్వార్లు.

9-5 : కాని అది కూడా మానసికమే అగుట వలన, బాహ్య సంశ్లేషాపేక్ష తో, దుఃఖము కలిగి, నాయికావస్థ లో తన అనన్యార్హశేషత్వాన్ని ప్రకటిస్తున్నారు.

9-6 : భగవత్సంశ్లేషానుభవము జ్ఞప్తికి తెచ్చుకొని బాధ పడుతున్నారు. స్వామి గుణానుభవము. తిరుక్కాట్కరై దివ్యదేశ ప్రస్తావనము.

9-7 : తిరుమూழிక్కళను దివ్యదేశపు ప్రస్తావనము. దూతప్రేషణము. తాము స్వామిని పొందక పోతే అస్తిత్వము లేదని తాము పిరాట్టి తో సమానమైన అవస్థ కలిగి అన్యాపదేశముగా స్వామికి విన్నవిస్తున్నారు.

9-8 దూత ప్రేషణము వలన కూడా స్వామి రాకపోయేసరికి, తానే స్వామిని చేరుటకు సిద్ధమయినారు. ఇచట తిరునావాయ్ దివ్యదేశ ప్రస్తావనము.

9-9 : ఆనాడు కృష్ణుడు అడవికి వెళ్ళిన వాడు ఇంకనూ తిరిగిరాకపోతే బెంగపెట్టుకున్న అంతమంది గోపికలవవలె తాను ఆ క్లేశాన్ని అనుభవిస్తున్నానని చెప్పడం.

9-10 : క్లేశము మీకు కాదు. నేను ఇక్కడ మీకోసమే తిరుక్కణ్ణపురములో వేచి యున్నాను, మీ శరీరావసానమున మీ కోరిక తీరుస్తాను అని చెప్పుటచే ఆనందము. లోకులకు ప్రపత్తి చేయుడని ఉపదేశము.

10-1 : ఆ స్వామియే తిరుమోగూర్లో నున్నాడు, ఆయనే ప్రాప్యుడు అంటూ ఉపదేశము చేసేరు.

10-2 : స్వామి తిరువనంతపురములో వేంచేసి యున్నాడు. ఆయనను అర్చించి, ఆయన నామము ఒక్కటైనా అనుసంధించమని ఉపదేశము చేస్తారు.

10-3 : కృష్ణుడు గోవులను మేపుటకు అడవికి వెళితే, మళ్ళీ తిరిగి రాడేమోనని అంతమంది గోపికలు పొందు క్లేశాన్ని పొందుతారు. పునఃవిశ్లేషభీరుత్వము.

10-4 లోకులకు ప్రపత్తి అంగముగా కల భక్తిని ఉపదేశిస్తారు.

10-5 : లోకులకు "నారాయణ" అను నామాన్ని అనుసంధించమనీ, పరమపదము పొందగలరనీ అంటూ, భక్తి మార్గాన్ని ఉపదేశిస్తారు.

10-6 : తిరువాట్టార్ దివ్యదేశప్రస్తావనము. స్వామికి పరత్వము కంటే ఆశ్రితపారతంత్ర్యమే స్వరూపమని చెబుతారు.

10-7 తిరుమాలిరుమ్ శోలై దివ్యదేశప్రస్తావనము. తమను అనుగమిస్తున్న స్వామితో తనకు దేహత్యాగము కల్గించమని ప్రార్థిస్తారు.

10-8 : తిరుమాలిరుమ్ శోలై, తిరుప్పేరై దివ్యదేశ ప్రస్తావనము. స్వామి తనపై చూపిన నిర్హేతుకమైన కృపను స్మరించి, ఆయన పాద కైంకర్యమే కోరుకుంటున్నట్లు చెబుతారు.

10-9 : స్వామి ఆళ్వార్లకు, ముక్తపురుషులు పరమపదాన్ని వేంచేసే అర్చిరాది మార్గాన్ని దర్శింపజేస్తాడు.

10-10 : స్వామిని తనకు ప్రత్యక్షానుభవాన్ని కటాక్షించమనీ, ఇక్కడినుండి పరమపదమునకు కొనిపొమ్మనీ ఆళ్వార్లు ప్రార్థించుట. పరమాత్మ ప్రత్యక్షమై, ఆళ్వార్లకు మోక్షాన్ని ప్రసాదించడము తో ఈ ప్రబంధము పూర్తవుతుంది.

ఈ విధముగా తత్త్వ, హిత, పురుషార్థజ్ఞానమును సవిస్తరముగా ప్రసాదించినది తిరువాయ్ మొళ్ళి దివ్య ప్రబంధము; సంపూర్ణ తత్త్వ జ్ఞానమును, అనుష్ఠానమునకు కావలసిన విధినిషేధపరిజ్ఞానపరిణతినీ, నిర్మల జ్ఞానముతో, భగవదితరవిషయవైరాగ్యముతో ప్రవర్తించినవారికి, పరమాత్మానుగ్రహముతో కలిగిన శారీరక మానసిక అనుభవములను, అంతమున అట్టివారు పొందు ఫలమును కూడ సంపూర్ణముగా జ్ఞాన, ఆచరణ,

అనుభవ పూర్వకముగా ప్రదర్శించి, ప్రసాదించిన మహత్ప్రబంధము కారుణ్యపూర్ణులును, ప్రపన్న జనకూటస్థులునైన నమ్మాళ్వార్లు మనకందించిన తిరువాయ్ మొళ్ళి దివ్యప్రబంధము.

మనమందరము ఆళ్వార్లు ప్రసాదించిన తత్త్వజ్ఞానమును పొంది, ఆయన కృపజేసిన ఉపదేశములను ఆచరించి ఆయన పొందిన దివ్యానుభవములయందు పాలుపంచుకొనునట్లు కృపజేయవలయునని ఆ ఆళ్వార్లను ప్రార్థించెదము.

అడియేన్

ఎస్.కె.వి. రామాచార్యులు రామానుజదాస (బెంగుళూరు)